క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుపై మందుబాబు వీరంగం



వినుకొండ(నూజెండ్ల): ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అద్దాన్ని ఓ యువకుడు మద్యం మత్తులో పగులగొట్టాడు. వినుకొండ డిపోకు చెందిన ఇంద్ర ఏసీ బస్సు బుధవారం రాత్రి 10.30గంటల సమయంలో ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్తుండగా కారంపూడి రోడ్డులో పెట్రోల్ బంక్ వద్ద బస్సు దగ్గరకు రాగానే ఇనుపరాడ్డు బస్సు పైకి విసిరాడు. దీంతో బస్సు డ్రైవర్ సదరు యువకుడిని వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ



వినుకొండ(నూజెండ్ల): మలేరియా నివారణ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా వినుకొండ సీహెచ్‌సీలో వైద్యాధికారుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దోమ పుట్టకూడదని, కట్టకూడదని, ప్రతిఒక్కరూ తప్పనిసరిగా దోమ తెరలు వాడాలని తెలియజేశారు. వర్షా కాలం మొదలవుతున్న నేపథ్యంలో ప్రతి ఇంటి ముందు, ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీపీ యూనియన్ వైద్యాధికారులు, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్‌వీ సుబ్బారావు, సూపర్‌వైజర్ రత్నకుమారి, పి.బాలస్వామి, వెంకట్రావు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం మండలంలోని మురికిపూడి గ్రామానికి చెందిన గౌరవరపు రాంబాబు(43) ప్రైవేటు ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తుంటాడు. గత నెల 5వ తేదీ విద్యుత్ పనులు చేయడానికి విద్యుత్ లైన్‌మెన్‌తో కలసి వెళ్లాడు. గ్రామంలోని క్వారీ వద్ద విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా హైటెన్షన్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన రాంబాబును గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా రామ్మోహన్

నరసరావుపేట: స్థానిక పురపాలకసంఘ కమిషనర్‌గా ఎం.రామ్మోహన్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం చేసిన కమిషనర్ల బదిలీల్లో పిఠాపురం కమిషనర్‌గా పనిచేస్తున్న రామ్మోహన్‌ను నరసరావుపేటకు బదిలీ చేసింది. ఇప్పటివరకు కమిషనర్‌గా వ్యవహరిస్తున్న డి.రవీంద్రను గుంటూరు కార్పొరేషన్‌లో ప్రాజెక్ట్ అధికారిగా నియమించింది.

కారుమంచిలో పోలీసుల మైత్రీ సదస్సు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో గ్రామస్తులతో మైత్రీ సదస్సు గురువారం రాత్రి పోలీసులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై గల్లా రవికృష్ణ అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ పాల్గొని మాట్లాడుతూ పార్టీలకు కులమతాలకు అతీతంగా గ్రామస్తులు గొడవలకు దూరంగా ఉండాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని గ్రామాలు

నాదెండ్ల: మండలంలోని అమీన్ సాహెబ్ పాలెం పరిధిలోని సబ్ స్టేషన్‌లో కనపర్రు ఫీడర్ మరమ్మతు దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ ఆర్.అశోక్ కుమార్ తెలిపారు. ఉదయం 7 నుంచి 12 గంటలకు వరకు నాదెండ్ల మండల పరిధిలో కనపర్రు మైనంపాడు గ్రామాలకు గృహ, వాణిజ్య, వ్యవసాయం సంబంధించిన సరఫరాలో ఉండదన్నారు.

చిలకలూరిపేట కమిషనర్ గోవిందరావు బదిలీ

చిలకలూరిపేట: మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు బదిలీ అయ్యారు. గత ఏడాది జూన్‌లో ఆయన మున్సిపల్ కమిషనర్‌గా విధుల్లో చేరిన ఏడాదికి బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో సీడీఎంఏలో ఏడీగా విధులు నిర్వహిస్తున్న జి.శేఖర్ నియమితులయ్యారు. ఆయన త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.



సూచనలు నరసరావుపేట ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణలో ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



సన్మానం గ్యారేజ్ ఆవరణలో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎండీ ద్వారకా తిరుమలరావు - నరసరావుపేట

రైతుభరోసా పథకంలో రూ.25 కోట్ల లబ్ధి

శావల్యాపురం: రైతుభరోసా పథకంలో నియోజకవర్గంలో 45 వేల 836 మంది రైతులకు రూ.25 కోట్లు 21 లక్షల లబ్ధిచేకూరినట్లు ఏడీఏ బోయపాటి రవిబాబు గురువారం తెలిపారు. ఏడీఏ మాట్లాడుతూ ఐదవ విడత రైతుభరోసా పథకంలో అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ ఈపథకం వర్తిస్తుందన్నారు. ఈ ఖరీఫ్ సీజనుకు రైతులకు వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం మొదట విడతలో ఒక్కో రైతు బ్యాంకులో రూ.5500లు నగదు జమ అవుతాయన్నారు.

జనం తోడుగా జగనన్న

- ప్రభుత్వానికి అండగా ప్రజలు
- ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు
- మంత్రి విడదల రజిని
- కావూరులో గడపగడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పేద ప్రజలకు తోడుగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని కావూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రజిని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరిస్తూ కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ధైర్యం, మన ఆశ, మన ధీమా అన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని వివరించారు. పేదలు ఈ రోజున రాష్ట్రంలో ఎంతో సంతోషంగా ఉన్నారంటే దానికి కారణం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలేనని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వివరించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని వెల్లడించారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వైద్యశాలలు కొత్త హంగులు సంతరించుకున్నాయని తెలిపారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని అన్ని వ్యాధులకు వర్తింపజేసి ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పూర్తిగా భరోసా కల్పిస్తున్నదని చెప్పారు. దీంతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణం శరవేగంగా చేస్తున్నారని వివరించారు. ప్రజలంతా ప్రభుత్వానికి అండగా ఉన్నారని చెప్పేందుకు కార్యక్రమానికి లభిస్తున్న స్పందనే నిదర్శనమన్నారు. ప్రభుత్వంపై ప్రజలు ఎంతో నమ్మకం, విశ్వాసంతో ఉన్నారని పేర్కొన్నారు. ఇలాంటి పాలన మళ్లీ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తా యాములయ్య, కక్కెర శ్రీనివాసరావు, నాగభైరు వెంకట్, కందుల ఆంజనేయులు, పెడవల్లి చినబాబు, గుమ్మడిదల నాగేశ్వరరావు, జెర్రిపోతుల కరుణామయుడు, బోడియ్య, అంకమ్మ, ఇశ్రాయేలు పాల్గొన్నారు.

ప్రజావసరాలు తీర్చటమే ప్రభుత్వ లక్ష్యం

- శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- పడమటిపాలెంలో పర్యటన



మంచినీటి పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: ప్రజావసరాలను తీర్చడంలో గ్రామాలకు మౌలిక సదుపాయాల ఏర్పాటులో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మండల కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. స్థానిక పడమటి పాలెంలో గల శేషమ్మ చెరువులో రూ. 8 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేయగా, స్థానిక బొడ్రాయిసెంటర్లో గల శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయం ఎదుట రూ. 2 కోట్ల రూపాయలతో నిర్మించనున్న టీటీడీ కళ్యాణ మండపం నిర్మాణమునకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు డా.గోపిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఈ గ్రామంలో మంచినీటి సౌకర్యం కోసం నిర్మించిన రెండు రక్షిత మంచినీటి ట్యాంకుల వలన ఉపయోగం లేకుండా పోయిందన్నారు. మంచి నీటి సమస్య పరిష్కారం కోసం పది ఎకరాల విస్తీర్ణంలో శేషమ్మ చెరువును బాగుచేయించి సాగర్ కెనాల్ నుంచి చెరువులోకి నీరు వచ్చే విధంగా చేయటం జరుగుతుందన్నారు. ఇక్కడ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేసి పైపులైన్ల ద్వారా గ్రామంలో ఇంటింటికీ మంచినీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. దీనికి మొత్తం సుమారు రూ. 8 కోట్ల రూపాయలు కేటాయించటం జరిగిందన్నారు. మొదటి విడతగా రూ.4.3 కోట్ల రూపాయలు, రెండవ విడతగా రూ.3.6 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయన్నారు. అదే విధంగా గ్రామంలో రూ.2.2 కోట్ల రూపాయలతో నిర్మించనున్న టీటీడీ కల్యాణ మండపం నిర్మాణమునకు భూమిపూజ చేశారు. గ్రామంలో గల శ్మశాన వాటికలలో గల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో కేంద్రియ విద్యాలయానికి కేటాయించిన స్థలంలో త్వరలో విద్యాలయం నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు, గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, కురుగుంట శ్రీనివాసరెడ్డి, జిల్లా వైఎస్సార్ యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, వీఆర్‌ఓ పడాల సుబ్బారెడ్డి, నాయకులు చపారపు సంజీవరెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి, మానుకొండ వాసుదేవరెడ్డి, పి.మల్లిఖార్జునరెడ్డి, పడాల రమణారెడ్డి, కల్లి సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, వివిధ శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

దివ్యాంగుడికి రూ.2.5 లక్షల చెక్కు అందజేసిన జిల్లా కలెక్టర్



కలెక్టరేట్‌లో దివ్యాంగుడికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. వినుకొండ నియోజకవర్గంలోని ఏనుగుపాలెంకు చెందిన దివ్యాంగుడు గుడిపూడి అంకారావుకు (పి.ఎం.ఈ.జి.పి) ప్రధానమంత్రి గ్రామీణ ఇన్ కంజనరేషన్ పథకం ద్వారా గ్రామంలో చిన్న తరహా పరిశ్రమ బంగాళదుంప చిప్స్ తయారీ (పొటాటో చిప్స్ ఇండస్ట్రీ) ఏర్పాటుకు కలెక్టర్ తోడ్పాటు అందించారు. గతంలో అంకారావు ఈ పథకం ద్వారా ఉపాధి పొందేందుకు కలెక్టర్ ద్వారా రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుడు చెల్లించాల్సిన మార్జిన్‌మనీ సరిపడినంత లేకపోవడంతో, కలెక్టర్ స్పందించి తగినంత ఆర్థిక సహకారం అందించారు. దీంతో ఏనుగుపాలెం కెనరాబ్యాంక్ అధికారులు లబ్ధిదారుడు అంకారావు పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన యంత్రసామాగ్రి కొనుగోలుకు రూ.2.50 లక్షల చెక్కును కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారుడు అందుకున్నారు. ప్రభుత్వం అందించిన సహకారాన్ని వినియోగించుకొని పరిశ్రమలు స్థాపించి, బ్యాంకు రుణాన్ని క్రమం తప్పకుండా చెల్లిస్తూ, జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని లబ్ధిదారునికి సూచించారు. సకాలంలో తీసుకున్న రుణాలను బ్యాంకులకు చెల్లించడం ద్వారా అర్హత కలిగిన ఇతర పేదలకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సంబంధితశాఖ అధికారులు పాల్గొన్నారు.

తొలిరోజు 79 శాతం పింఛన్ల పంపిణీ



చిలకలూరిపేటటౌన్: వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా ప్రతినెలా ఒకటో తేదీ పింఛన్‌దారులకు అందించే పింఛన్‌ను వలంటీర్లు గురువారం తెల్లవారు జాము నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. పట్టణంలో తొలిరోజు 79 శాతం, మండలంలో 58.26 శాతం పంపిణీ చేశారు. మిగిలిన రోజుల్లో పింఛన్ పంపిణీ చేయనున్నారు.

జూనియర్ కళాశాలలో ఇద్దరు బాలికలు చేరిక



యడ్లపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లస్ టు జూనియర్ బాలికల కళాశాల ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానుంది ఈ నేపథ్యంలో పాఠశాల ఉపాధ్యాయులు కళాశాల సీట్ల భర్తీ కోసం ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని జగ్గాపురం, ఉన్నవ, వంకాయలపాడు గ్రామాలలో పర్యటించారు. 2022–23 ఏడాదిలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన బాలికల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తొలిరోజు ఇద్దరు బాలికలు చేరినట్లు ఉపాధ్యాయులు వెల్లడించారు.

వినుకొండ కమిషనర్ బదిలీ

వినుకొండ(నూజెండ్ల): పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.శ్రీనివాసులు సాధారణ బదిలీలో భాగంగా బాపట్ల జిల్లా అద్దంకి బదిలీ అయ్యారు. నూతన కమిషనర్‌గా ఇంకా ఎవరిని నియమించలేదు.

క్రీస్తు మార్గం అందరికీ ఆదర్శం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని సన్మానిస్తున్న ఏబీసీసీ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): దేవుని దృష్టిలో అందరూ సమానులే అనే భావన కలిగి ఉండాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో జీప్సీ చర్చిలో ఏబీసీసీ క్రైస్తవుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శమని, ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాలని సూచించారు. పేదరికాన్ని జయించాలంటే విద్య ద్వారానే సాధ్యమవుతుందని గుర్తు చేశారు.

క్రైస్తవ మిషనరీ సభ్యులు పేద విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అండగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం చర్చి పాస్టర్లు ఎమ్మెల్యే బొల్లాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏబీసీసీ ప్రెసిడెంట్ శామ్యూల్ కృపాకర్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు గుండాల స్వెనోమ్, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా నాగిరెడ్డి, నన్ని పాల్గొన్నారు.

కోటప్పకొండలో నర్సరీల అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నర్సరీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ ప్రాంతంలో నర్సరీలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని పమిడిమర్రు గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీలతో ఏర్పాటు చేసిన ఐదు నర్సరీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ నర్సరీలకు కోటప్పకొండ ప్రాంతం అనుకూలంగా ఉంటుందన్నారు. ఉద్యానశాఖ సహకారంతో రైతులు నర్సరీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కోటప్పకొండ చుట్టుప్రక్కల పదిహేను గ్రామాల్లో మెట్టపైర్లు సాగు చేస్తారని, ముఖ్యంగా మిర్చి పంటలను అధికంగా వేస్తారని తెలిపారు. ఈ ప్రాంత రైతులు గతంలో మిరప నారు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు స్థానికంగా నర్సరీలు రావడంతో రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు నాణ్యమైన నారు పెంపకాన్ని రైతులు పర్యవేక్షించవచ్చని తెలిపారు. అధునాతన టెక్నాలజీతో వైరస్‌లు సోకకుండా నారును పెంచే వేసులుబాటు అందుబాటులోకి వచ్చిందని, రైతులు నర్సరీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్‌లు దాసరి శ్రీనివాసరావు, వెన్నపూస నాగిరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

అవన్నీ అసత్య కథనాలే

ఖండించిన ఏపీఎస్‌బీసీఎల్ సిబ్బంది



మాట్లాడుతున్న మద్యం దుకాణం సూపర్‌వైజర్లు

వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, చట్టప్రకారం ఒక వ్యక్తికి మూడు మద్యం బాటిళ్లు మాత్రమే విక్రయిస్తున్నామంటూ ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద సూపర్‌వైజర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నారనే ఓ దినపత్రికలో వచ్చిన వార్తా కథనాన్ని ఖండించారు. అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారనే విషయాన్ని కూడా వారు ఖండించారు. ఒక వినియోగదారుడు ఇతర వస్తువులు కొనుగోలు చేసి మద్యం దుకాణం వద్ద ఖాళీ అట్టపెట్టెలో మద్యం బాటిల్ కొనుగోలు చేసి వెళ్తుండగా ఫొటోలు తీసి మద్యం తరలిస్తున్నారంటూ వచ్చిన కథనాన్ని వారు తప్పుపట్టారు. వాస్తవాలు ఉంటే ప్రజలకు తెలియజేయాలని అసత్య కథనాలు ప్రచురించడం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.రమేష్, కృష్ణానాయక్, శివశంకర్, రాజు, హనుమానాయక్, యాసిన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

గోదాముకు భూమి పూజ

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామం సొసైటీ పరిధిలో గుంటుపాలెం గ్రామంలో రైతుభరోసా గోదాం నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా కారుమంచి సొసైటీ చైర్మన్ బొల్లా వెంకట సాంబశివరావు ప్రభుత్వ స్థలం 33 సెంట్లు వ్యవధిలో రూ.40 లక్షల వ్యయంతో 500 మెట్రిక్ టన్నులు గోదాం పనులకు భూమి పూజ చేపట్టగా నాలుగు నెలల వ్యవధిలో పనులు పూర్తి అవుతాయన్నారు.

ఆరంభమైన ప్రతిష్టా కార్యక్రమాలు

వినుకొండ టౌన్: పట్టణంలోని మార్కాపురం రోడ్డు నందుగల రావి చెట్టు రంగా బొమ్మ సెంటర్‌లో శ్రీ మహాలక్ష్మి దేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలియచేశారు.

శనివారం గణపతి పూజ, ఘర్తాన్యాసము, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ట, మహా పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు వెల్లడించారు.

కౌలు రైతు అర్హత కార్డులకు దరఖాస్తు చేసుకోండి

నాదెండ్ల: అర్హులైన కౌలు రైతులు రుణ అర్హత కార్డులను పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. గ్రామ రెవెన్యూ అధికారుల వద్ద దరకాస్తు ఫారాన్ని తీసుకుని సాగు రైతుల నుంచి పాస్‌బుక్ జిరాక్స్‌తో పాటు వారి ఆధార్ కార్డు, ఆమోద పత్రం తీసుకుని కౌలు రైతు ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా నంబర్‌తో సహా గ్రామ రెవెన్యూ అధికారికి అందజేయాలన్నారు. పరిశీలించిన వీఆర్వోలు రుణ అర్హత కార్డులను మంజూరు చేస్తారని, గ్రామ సభల ద్వారా వాటిని కౌలు రైతులకు అందిస్తామన్నారు.

నాదెండ్లలో 80 శాతం పెన్షన్ పంపిణీ

నాదెండ్ల: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక గురువారం తొలిరోజున 80 శాతం పంపిణీ చేయడం పూర్తయింది. ఉదయాన్నే వలంటీర్లు తలుపుతట్టి పెన్షన్‌దారులకు నగదు అందజేశారు. మండలం పరిధిలో 9274 మందికి గానూ, రూ.2,55,75,250 పంపిణీ చేయాల్సి ఉండగా, తొలిరోజు 80 శాతం పూర్తి చేశారు. ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు పర్యవేక్షించారు.

చుక్కల భూముల విముక్తి పత్రాలు అందజేత



నాదెండ్ల: చుక్కల భూములకు విముక్తి కలిగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో మేరకు మండలంలో 32 మంది రైతులకు చుక్కల భూములకు హక్కు పత్రాలను అందజేశారు. సాతులూరు, తూబాడు తదితర గ్రామాలకు చెందిన రైతులకు తహసీల్దార్ ఏవీ రమణ రెవెన్యూ సిబ్బందితో కలిసి హక్కు పత్రాలను అందజేశారు.

ఘనంగా తిరునాళ్ల వేడుకలు

శావల్యాపురం: మండలంలోని గుంటుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల వేడుకలు గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ పూజారి స్వామి వారిని పూలదండలు నూతన వస్త్రాలు అలంకరణ చేశారు. స్వామివారిని దర్శించుకొన్న వారిలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, తదితరులు ఉన్నారు.

మేళ్లవాగులో ఘనంగా ప్రతిష్టా మహోత్సవం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

బొల్లాపల్లి : మండలంలోని మేళ్లవాగు గ్రామంలో పాటిపాటేశ్వరమ్మ అమ్మవారు ఆలయ విగ్రహ పునఃప్రతిష్టా మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణతో ఐదు రోజులుగా అమ్మవారు నాగేంద్రస్వామి తదితర దేవతామూర్తులు కొలువు తీరాయి. ప్రతిష్టా మహోత్సవంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారికి పొంగళ్లతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్ సీసీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.